క్లుప్తంగా

విద్యా బోధనపై ప్రత్యేక శ్రద్ధ



తాడూరు: విద్యా బోధనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటునట్లు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా పాఠాలు బోధించాలన్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. సమావేశంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యాటకుల సందడి



పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్టలో కృష్ణానది నిండుకుండలా ప్రవహిస్తుండడంతో కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు గురువారం పర్యాటకులు అధికసంఖ్యలో తరలి వచ్చారు. ప్రకృతి ఆస్వాదిస్తూ సందడి చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన కూన మణెమ్మ(32) అనారోగ్యంతో మృతిచెందింది. బాధిత కుటుంబానికి గురువారం చెన్న కేశవ యువజన సంఘం ఆధ్వర్యంలో రూ.10000 ఆర్థికసాయం అందజేశారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన గుట్టకాడి బాలస్వామి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న భవన నిర్మాణ తాపీ సంఘం అధ్యక్షుడు కొల్లె తిరుపతయ్య, ఉపాధ్యక్షుడు గుడిస్వామి, తిరుపతయ్యలు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి భార్యకు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు.

విద్యాకమిషన్ సభ్యుడికి సన్మానం



కల్వకుర్తిరూరల్: రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడిగా ఎంపికైన చారకొండ వెంకటేష్‌ను గురువారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్‌గౌడ్ హైదరాబాద్‌లో ఆయన నివాసం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నా



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట గురువారం ఏజెంట్లు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. పాలసీ ప్రీమియంపై జీఎస్టీ ట్యాక్సీలను తొలగించాలని పాలసీదారులకు మెరుగైన సేవలు అందించాలనే డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏజెంట్లు శ్రీనివాస్, రాంగోపాల్ రెడ్డి, దుగ్గి అశోక్, యుగంధర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షురాలిగా జయమ్మ

కల్వకుర్తి: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా జయమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కల్వకుర్తి ఐటీఐ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న జయమ్మను ఎన్నుకోవడంతో టీఎస్‌జీవో జిల్లా అధ్యక్షుడు బావండ్ల వెంకటేష్ సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణలు నియామక పత్రం అందజేశారు.

రసవత్తరంగా క్రీడాపోటీలు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలలో కొనసాగుతున్న ఉమ్మడి జిల్లా క్రీడాపోటీలు గురువారం రసవత్తరంగా కొనసాగాయి. ఉమ్మడి జిల్లాలోని 16 గురుకుల పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థినులు పలు క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ పోటీలు పోటాపోటీగా కొనసాగాయి.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



ట్రాక్టర్‌ను నడుపుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నూతన ట్రాక్టర్లను ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో 2024–25 ఆర్థిక సంవత్సర ప్రత్యేక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులపై చర్చించారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, కమిషనర్ శ్యాంసుందర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం

మన్ననూర్: స్థానిక పీటీజీ పాఠశాల/కళాశాల ఆవరణలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభను కనబరిచి పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గురువారం బహుమతులు ప్రదానం చేశారు. 10 రోజులుగా కొనసాగిన క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటూ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, పాఠశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్, అంతటి మల్లేష్, ఎస్‌బీఐ మేనేజర్ రాములు, నాయకులు హన్మంత్‌రెడ్డి, వెంకటరమణ, రహీం, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రవి, రాజారాం, శంకరయ్య, గంగాజీ, చంద్రమౌళి పాఠశాల సిబ్బంది, టోర్నమెంట్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతో దళితుల ఐక్యతకు విఘాతం

మన్ననూర్: వర్గీకరణతో దళితుల ఐక్యతకు విఘాతం కలుగుతుందని మాల మహానాడు రాష్ట్ర నాయకుడు కుంద మల్లికార్జున్ అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయం ఎదుట మాల మహానాడు నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 27న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే మాలల ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాలకులు వర్గీకరణ ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దళితులు ఐక్యంగా ఉండకుండా కుట్రలు చేయడం మానుకోవాలన్నారు. లేనిపక్షంలో మాలల సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు.

బ్రిడ్జికి మరమ్మతు



పెంట్లవెల్లి: మండల కేంద్రం నుంచి మాధవస్వామి నగర్, మంచాలకట్ట వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న బ్రిడ్జి వర్షాలకు దెబ్బతింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామన్‌గౌడ్ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి స్పందించి రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు గురువారం బ్రిడ్జికి మరమ్మతు పనులు చేపట్టారు. నాయకులు కబీర్, గ్రామస్తులు ఉన్నారు.

మార్చాలలో గ్యార్మీ

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలలో గురువారం గ్యార్మీ నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అల్వాల్‌రెడ్డి, కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, రైతుసమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నిజాముద్దీన్, మసీద్ కమిటీ అధ్యక్షుడు ఖాజామైనోద్దీన్, తాజుద్దీన్, సుధాకర్‌రెడ్డి, భాస్కర్, భాస్కర్‌రెడ్డి, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

తాడూరు: దళితవాడల్లో మౌలిక వసతులు కల్పించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ అన్నారు. గురువారం మండలంలోని ఆకునెల్లికుదురులో డీహెచ్‌పీఎస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దళితవాడలు సమస్యలకు నిలయాలుగా మారాయని వాపోయారు. సైన్స్ టెక్నాలజీ సాంకేతిక రంగాల్లో దేశం ఎంతో అభివృద్ధి చెందుతున్నా గ్రామీణ ప్రాంతాల్లో అంటరానితనం మాత్రం పోవడం లేదన్నారు. దళిత వాడల్లో సీసీ రోడ్లు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు ఊశన్న, నర్సింహా, బాలపీరు, శ్రీను, బాలస్వామిలు పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణే ధ్యేయం

కొల్లాపూర్ రూరల్: అడవుల పరిరక్షణే ఫారెస్ట్ అధికారుల కర్తవ్యం అని రేంజర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని ఎర్రగట్టు బొల్లారం సమీపంలో ఉన్న ఫారెస్టులో ఇటీవల నాటిన మొక్కలను సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారెస్టులో చెట్లను ఎవరు అయిన నరికిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పోస్టర్ విడుదల



కోడేరు: మండలంలోని రాజాపూర్‌లో మాలల ఆత్మగౌరవ సభ పోస్టర్లు మాలల సంఘం మండల కన్వీనర్ మధుసూదన్, రంగదాస్‌లు గురువారం విడుదల చేశారు. ఈ నెల 27న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని కోరారు. పట్టాభి, నాగేంద్రం, మల్లికార్జున్, మహేష్, మహేందర్, మల్లేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఆశ్రమ పాఠశాలలో గురువారం సిద్ధాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న కారణంగా ముందస్తుగా పరీక్షలు చేశారు. అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శిరీష, సూపర్‌వైజర్ హన్మంత్, స్కూల్ హెచ్‌ఎం లింగస్వామి, ఏఎన్‌ఎం ఇందిర, అలివేల, ఆశావర్కర్లు లక్ష్మి, నీల, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బీజేపీతోనే పేదలకు మేలు



ఉప్పునుంతల: బీజేపీతోనే పేదలకు మేలు చేకూరుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు వావిలాల రమేష్, సభ్యత్వ ఇన్‌చార్జ్ ఏళ్ల సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మర్రిపల్లిలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, ఇతర అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి తిరిగి సభ్యత్వాలను నమోదు చేయించారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మాచారి, ఎల్లయ్యయాదవ్, కరుణాకర్‌రావు, చిన్నయ్య, కొండల్‌గౌడ్, ఎండీ సుల్తాన్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పంట ధ్వంసం కేసు నమోదు

బల్మూర్: మండలంలోని గోదల్ గ్రామానికి చెందిన ఓ రైతు వేరుశనగ పంటను ధ్వంసం చేసిన ఘటనలో గురువారం ఒకరిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చాంద్‌పాషా తెలిపారు. గ్రామానికి చెందిన కొత్తపల్లి నర్సింహారెడ్డి పొలంలో సాగు చేసిన నాలుగు ఎకరాల వేరుశనగ పంటను అతని సోదరుడు కుమారుడు కొత్తపల్లి రాజేశ్వర్‌రెడ్డి పంటను ధ్వంసం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

భూ వివాదంలో ఇరువర్గాలపై..

వెల్దండ: మండలంలోని రాచూర్ గ్రామానికి చెందిన దుబ్బ బాల్‌లింగం, దుబ్బ సలేశ్వరం ఇద్దరి మధ్య కొంత కాలం నుంచి భూ వివాదం ఉంది. గురువారం ఈ విషయమై గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ భవనం వద్ద ఇరు వర్గాల వారు కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇరువర్గాల వారు గాయపడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

పూసల కులస్తులను ఆదుకోవాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: సమాజంలో అత్యంత వెనకబాటుకు గురైన పూసల కులస్తులకు ప్రభుత్వం రుణాలు ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు తన్నీరు నర్సింహ కోరారు. ఈ సందర్భంగా గురువారం బీసీ వెల్ఫేర్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వెనకబడి సంచార జీవితం గడుపుతూ ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనకబడ్డామని వివరించారు. కార్యక్రమంలో పూసల సంఘం రాష్ట్ర నాయకులు పొదిల రామయ్య, నాయకులు కోనేటి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపాలి



కొల్లాపూర్: కేసుల పరిష్కారానికి ప్రాసిక్యూషన్, పోలీసు అధికారులు చొరవ చూపాలని కొల్లాపూర్ జూనియర్ సివిల్ కోర్టు ఫస్ట్ అడిషనల్ జడ్జి జ్యోత్స్న గుంటి సూచించారు. గురువారం ఆమె కోర్టు హాల్‌లో ప్రాసిక్యూషన్, పోలీసు, ఎక్సైజ్, ఫారెస్టు అధికారులతో సమావేశం అయ్యారు. ప్రస్తుతం కోర్టు ప్రధాన జూనియర్ సివిల్‌జడ్జిగా, 2 వ అదనపు జడ్జిగా, లోక్ అదాలత్ చైర్మన్‌గా ఆమె అదనపు బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేసుల నమోదు విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. డిసెంబర్ నెలలో నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో సీఐ మహేష్, ఎస్ఐలు హృషికేష్, సతీష్, గోకారి, రామన్‌గౌడ్, లోక్‌అదాలత్ ఇన్‌చార్జ్ భోగా హరికృష్ణ, తదితరులు ఉన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



లింగాల: మండలంలోని సూరాపూర్, అవుసలికుంట, మగ్దూంపూర్, కొత్తకుంటపల్లి ప్రాథమిక పాఠశాలలను గురువారం మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అదే విధంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి బోధనలో పాటించాల్సిన మెళుకువల గురించి ఉపాధ్యాయులకు వివరించారు. అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీ హరిలాల్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల కళాశాల కమిటీ ఎన్నిక



బల్మూర్: మండలంలోని కొండనాగుల ఉమామహేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కళాశాల కమిటీని గురువారం జిల్లా కన్వీనర్ బాలరాజు సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాయత్రి, ప్రధాన కార్యదర్శిగా కె.వెంకటస్వామి, కోశాధికారిగా ముంతాజ్ బేగంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అధ్యాపకులు కొర్ర ఈశ్వర్‌లాల్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం

లింగాల: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ నాగరాజును గురువారం ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. మండలంలో శాంతి భద్రతల విషయంలో పోలీసులకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అశోక్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నేరుగా పాఠశాలలకు బియ్యం ఇవ్వండి



చారకొండ: మధ్యాహ్న భోజనానికి సంబంధించి సన్న బియ్యాన్ని నేరుగా పాఠశాలలకు పంపిణీ చేయాలని కోరుతూ గురువారం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా గోదాం నుంచి పాఠశాలలకు నేరుగా అందజేస్తున్నారని కాని కల్వకుర్తి డివిజన్‌లో మాత్రం పాఠశాలలకు పంపిణీ చేయడం లేదని వివరించారు. ఉపాధ్యాయులు గోదాంలకు వెళ్లి బియ్యం తీసుకొస్తున్నారని దీంతో విధులకు ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, మండల అధ్యక్షుడు వంగూరి రాజు గౌడ్,జిల్లా బాధ్యులు మోతీరాం, సురేష్, పాండయ్య, మండల బాధ్యులు జగదీశ్వర్ తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయండి

నాగర్‌కర్నూల్‌రూరల్: జడ్చర్ల పట్టణంలో ఈ నెల 30న నిర్వహించే ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కన్వీనర్ చౌట కాశీం, జిల్లా కన్వీనర్ గూడ విజయ్, దశరథం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరిలు కోరారు. గురువారం పట్టణంలోని బాబు జగ్జీవన్‌రాం భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.

కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు, కార్మికులు

కొల్లాపూర్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం సమ్మె నోటీసును గురువారం కొల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యనాగరాజు, జూనియర్ అసిస్టెంట్ ప్రేమయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలన్నారు. శుక్రవారం నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్మికులను సీనియారిటీ ప్రాతిపదికన రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు రాము, ప్రసాద్, భగవాన్, రఘు, లక్ష్మి, చంద్రకళ, చిరంజీవి, కురుమయ్య, చెన్నమ్మ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపు మంజూరు చేయాలని వినతి



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బైరాపూర్ గ్రామస్తులు

వెల్దండ: మండలంలోని బైరాపూర్ కాలనీకి కొత్తగా రెండో రేషన్‌షాపు మంజూరు చేయాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా గ్రామానికి మహిళ సంఘాల సమావేశాల కోసం కొత్తగా డ్వాక్రా భవనం నిర్మించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ సర్పంచ్ లక్ష్మమ్మ, కల్వ యాదమ్మ, నాయకులు తలారి రమేష్, కుడుముల వెంకటేష్, మధు, సాయిలు, లక్ష్మయ్య, ఈరమ్మ, కిష్టమ్మ, పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి



కొట్రలో సర్వే చేస్తున్న ఎంపీఓ లక్ష్మణ్, సిబ్బంది

వెల్దండ: అనుమతిలేని లేఅవుట్‌లకు ప్రభుత్వ (ఎల్ఆర్ఎస్) రెగ్యులరైజేషన్ స్కీంను తీసుకొచ్చిందని, గతంలో ప్లాట్లు కొనుగోలుచేసిన వారందరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఓ లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొట్ర గ్రామంలో ఎల్ఆర్ఎస్‌పై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కొట్ర, పెద్దాపూర్, వెల్దండ, బండోనిపల్లి, కుప్పగండ్ల, పోతేపల్లి, రాఘయపల్లి, రాచూర్, చెర్కూర్, చౌదర్‌పల్లి, బొల్లంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన లే అవుట్లలోని ప్లాట్లు కొనుగోలు చేసిన వారందరు ఎల్ఆర్ఎస్ చేసుకోవాలన్నారు. ప్లాట్ల యాజమానులు ప్లాట్ డాక్యుమెంట్లు, ఈసీ, ఇతర పత్రాలను తీసుకొని గ్రామ కార్యదర్శులను సంప్రదించి ఎల్ఆర్ఎస్ చేసుకోవాలన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం 3,636 ప్లాట్లు ఉన్నాయన్నారు. వెల్దండలో 140, కొట్రలో 185, కుప్పగండ్లలో 13 ప్లాట్లను రద్దు చేసిందన్నారు. కోర్టు కేసులు, ప్రభుత్వ భూముల్లో చేసిన లే అవుట్లను పరిగణలోకి తీసుకోవడం లేదని, ఆ ప్లాట్లను ప్రభుత్వం రద్దు చేస్తుందన్నారు. ఇప్పటి వరకు కేవలం 324 ప్లాట్లకు మాత్రమే ఎల్ఆర్ఎస్ చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి భాస్కర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కార్పొరేట్ల మేలు కోసమే పన్నుల భారం



మాట్లాడుతున్న ఎల్ దేశ్యానాయక్

ఉప్పునుంతల: కార్పొరేట్ల మేలు కోసమే కేంద్ర ప్రభుత్వం పన్నుల భారం మోపుతోందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్ దేశ్యానాయక్ ఆరోపించారు. గురువారం మండలంలోని కాంసానిపల్లిలో నిర్వహించిన సీపీఎం 4వ మండల మహాసభలలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదాని, అంబానీ వంటి కార్పొరేట్ బడా పెట్టుబడిదారులకు రూ.13 లక్షల కోట్ల రాయితీలు అందించిందన్నారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు మల్లేష్, శంకర్‌నాయక్, నాయకులు రాములు, శివకుమార్, మండల కార్యదర్శి చింతల నాగరాజు, శ్రీరాములు, ఉస్సేన్, మల్లయ్య, వెంకటయ్య, చంద్రయ్య, నాగయ్యగౌడ్, కిష్టయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు



మన్ననూర్: ప్రపంచ పోలియో దినోత్సవంలో భాగంగా గురువారం మన్ననూర్ గ్రామంలో మాజీ జెడ్పీటీసీ, సీబీఎం ట్రస్టు చైర్మన్ డాక్టర్ అనురాధ చిన్నారులకు పోలియో చుక్కల మందును వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు చుక్కల మందు వేయించాలన్నారు. గ్రామంలోని 5 ఏళ్ల లోపు పిల్లలందరికి కూడా పోలియో చుక్కల మందు వేయించాలని కోరారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర ఆలయం కమిటీ డైరెక్టర్ సంబు శోభ, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ హన్మంత్‌రెడ్డి, మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం, గోపాల్‌రెడ్డి పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు సక్రమంగా చెల్లించాలి

తెలకపల్లి: మహిళలు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని ఐకేపీ ఏపీఎం నిరంజన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో సీసీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ తెలకపల్లి, గౌరెడ్డిపల్లి, రాంరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఉన్న మహిళ సంఘాల సభ్యులు రుణాలు చెల్లించేవిధంగా అవగాహన కల్పించాలని సీసీలకు సూచించారు. నిరంజన్, నర్సింహులు పాల్గొన్నారు.

స్క్రాప్ వ్యాపారులపై జీఎస్టీ మినహాయించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్క్రాప్ వ్యాపారులపై జీఎస్టీ మినహాయించాలని స్క్రాప్ కలెక్టివ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు కుంభం మల్లేష్ గౌడ్ కోరారు. గురువారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన స్క్రాప్ దుకాణాల కార్మికుల సమావేశంలో మాట్లాడారు. రవాణా మార్గంలో జీఎస్టీ అధికారుల పేరుతో నకిలీ ముఠా వసూళ్లను అరికట్టాలన్నారు. ప్రభుత్వం చెత్త ఏరుకునే వారికి కార్మిక చట్టాలు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా నాయకులు నిరంజన్, లక్ష్మయ్య, అరవిందాచారి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: బెల్ట్ దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ జిల్లా అధికారి గాయత్రికి బీఎంపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గద్దం విజయ్ గురువారం వినతిపత్రం అందజేశారు. అనుమతులు లేకుండా గ్రామాల్లో మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారని వివరించారు. అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణాలను మూసివేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, కల్మూరి శేఖర్, లక్ష్మయ్య, వాసుదేవ్, మోహన్, ప్రకాశ్ పాల్గొన్నారు.

చర్మకారుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పుల్జాల పరశురాం

నాగర్‌కర్నూల్‌రూరల్: చర్మకారుల సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా నాయకుడు పుల్జాల పరశురాం డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిని సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. చెప్పులు కుట్టే వారందరికీ రూ.లక్ష రుణం ఇవ్వాలని, టూల్‌కిట్స్ ఇవ్వాలన్నారు. బహుళ జాతి కంపెనీల కారణంగా చర్మకారుల జీవితాలు దుర్భరంగా మారయన్నారు. జినుకుంట వద్ద ఉన్న లెదర్ పార్కును ప్రారంభించి దళిత ఉద్యోగ యువతీ యువకులకు పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అంతటి కాశన్న, ఉపాధ్యక్షుడు హనుమగల్ల హనుమంత్, నాయకులు కిషోర్, రాజు, సత్యనారాయణ, నందిపేట భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.